

పనుల జాతర ప్రారంభం : జడ్పీ సీఈవో గోవింద్

సోన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధిహామీ పథకం కింద రైతులు, కూలీలకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మండలంలోని కడ్తాల్ గ్రామంలో నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో మాట్లాడుతూ... జాతీయ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే గొర్రెలు, పశువుల పాకలు, పౌల్ట్రీ, పొలం బాటలు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా 100 రోజులు ఈజీఎస్ పనులు పూర్తి చేసిన కూలీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఏపీవో మంజుల, పంచాయతీ సెక్రటరీ రాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోతులు రాకుండా కాపలా!

గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని గల్లీలలో కోతుల బీభత్సంతో జనం తల్లడిల్లిపోతున్నారు. వీధులన్నింటినీ కోతులు హైజాక్ చేసి గంటల తరబడి హంగామా సృష్టిస్తున్నాయి. గల్లీలో కోతుల గుంపులన్నీ భారీ సంఖ్యలో గలాటా చేస్తున్న కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక అవస్థల పాలవుతున్నారు. చేతిలో కర్రలేకుండా ఒక గల్లీ నుంచి ఇంకో గల్లీకి దాటి వెళ్లడం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.

నిర్మల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా చాలా గ్రామాల్లో కోతులతో జనం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ముఖ్యంగా కొద్దినెలల నుంచి కోతుల గుంపుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో పలు గ్రామాల్లోని యువకులు, రైతులు కాపలా టీమ్‌లను ఏర్పాటు చేసుకొని కోతులను తమ గ్రామాల నుంచి తరిమి వేస్తున్నారు. కొంత మంది టీమ్‌లు ఏర్పాటు చేసుకొని కోతుల కాపలా కోసం వంతుల వారీగా డ్యూటీలు వేసుకుంటుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ టీమ్‌ల సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కోతులను తమ ఊరి నుంచే కాకుండా పంట చేలల్లోకి రాకుండా కర్రలతో వాటిని బెదిరిస్తూ బయటకి తరుముతున్నారు. అయితే రాత్రివేళల్లో మళ్లీ కోతులు యధావిధిగా ఊళ్లల్లో సంచరిస్తుండడం జనాన్ని అవస్థలకు గురిచేస్తుంది. కాగా కోతులు పంటలను నాశనం చేస్తుండడం సహజంగా మారుతోంది. ఒకవేళ ఎవరైనా ఒక కోతిని బెదిరిస్తే పదులసంఖ్యలో కోతుల గుంపులు వచ్చి ఎదురు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయపడ్డ వారు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు ఐదారుగురు కన్నా ఎక్కువ మంది కోతుల దాడిలో గాయపడిన వారు చికిత్సల కోసం వస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. అయితే కోతులు ఇళ్లల్లోకి కూడా చొరబడుతూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది మున్సిపల్ అధికారులకు, ఫారెస్ట్ అధికారులకు కోతుల విషయంలో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అలాగే గ్రామీణ ప్రాం తాల్లో ఇళ్లల్లోకి చొరబడుతున్న కోతులు అక్కడి పం టచేలను సైతం నాశనం చేస్తున్నాయని అంటున్నా రు. గుంపులు గుంపులుగా పంటలపై దాడులు చేస్తుండడంతో రైతులు రాత్రింబవళ్లు వాటిని అడ్డుకునేందుకు కాపలా కాస్తున్నారు. పంటలను కోతుల నుంచి రక్షించుకోవడం రైతులకు సవాలుగా మారిం ది.

ఊరూరా మంకీ ప్రొటెక్షన్ టీమ్‌లు...

రోజు రోజుకు కోతుల బాధలు తీవ్రమవుతుండడంతో విసిగిపోతున్న ప్రజలు తమకు తామే ఆత్మ రక్షణ కల్పించుకునే బాధ్యతను తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఊర్లలోకి, పంట చేలల్లోకి కోతులను రాకుండా చేసేందుకు ఆ గ్రామంలోని యువకులు, రైతులు ప్రత్యేక కాపాలా టీమ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలోని వారంతా ఈ టీమ్‌లలో సభ్యులుగా ఉండి వంతుల వారీగా కర్రలతో కాపలా కాస్తూ తమ ఊళ్లల్లోకి అలాగే పంట చేలల్లోకి కోతులను రాకుండా అడ్డుకుంటున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కాపలా కొనసాగుతుండగా రాత్రి వేళల్లో మాత్రం కోతులు యధావిధిగా మళ్లీ ఊళ్లోకి చొరబడుతున్నాయని, అలాగే పంట చేలను సైతం నాశనం చేస్తున్నాయన్నారు. లక్ష్మణచాంద మండలంలోని పీచర, రాచాపూర్, వడ్యాల్, నిర్మల్ మండలంలోని చిట్యాల, సోన్, మామడ తదితర గ్రామాల్లో కాపలా బృందాలు ఏర్పడ్డాయి.

పట్టించుకోని మున్సిపాలిటీలు,పంచాయతీలు...


కోతుల నుంచి రక్షించే విషయంలో సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కోతులను మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పట్టుకొని నిర్మల్‌లోని కోతుల పునరావాస కేంద్రానికి తరలించాల్సి ఉంది. అయితే కోతులు పట్టే వ్యవహారం ఖరీదుగా మారిపోవడమే కాకుండా కోతులు పట్టేవారు కూడా అందుబాటులో లేకపోతుండడం సమస్యను మరింత జటిలం చేస్తుందంటున్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో కోతులను పట్టుకునేందుకు ఎలాంటి బడ్జెట్ లేకపోవడం ఓ సమస్యగా మారిందంటున్నారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీలు మాత్రం సాధారణ నిధుల నుంచి కోతులను పట్టుకొని నిర్మల్ పునరావాసానికి తరలిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడి చించోలి వద్ద గల కోతుల పునరావాస కేంద్రానికి సిద్దిపేట, నర్సాపూర్ మున్సిపాలిటీల నుంచి దాదాపు 500ల కోతులను కుటుంబనియంత్రణ ఆపరేషన్ కోసం తీసుకువచ్చినట్లు ఇక్కడి వైద్యాధికారి తెలిపారు. అయితే నిర్మల్ జిల్లా నుంచి మాత్రం ఆశించిన రీతిలో పునరావాస కేంద్రానికి కోతులను స్టెరిలైజేషన్ కోసం తీసుకురాకపోతుండడం విమర్శలకు తావిస్తోంది.

మూడున్నరేళ్ల నుంచి కేవలం 1456 స్టెరిలైజేషన్లు మాత్రమే...

నిర్మల్ జిల్లా కేంద్ర సమీపంలోని చించోలి(బీ) గండి రామన్న హరిత వనంలో 2020లో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ (కోతుల పునరావాస కేంద్రం)లో ఇప్పటి వరకు కేవలం 1456 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (స్టెరిలైజేషన్) చేశారు. ఇక్కడ 2020 డిసెంబర్‌లో కోతుల పునరావాస కేంద్రాన్ని దాదాపు కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో గల కోతులను పట్టుకొని ఇక్కడి కేంద్రానికి తీసుకురావాల్సి ఉంది. ఇక్కడ స్టెరిలైజేషన్లు కాగానే వాటిని తిరిగి అదే ప్రాంతానికి పంపుతారు. ప్రతిరోజు 20కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సౌకర్యం ఇక్కడ ఉన్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. ఇక్కడి కేంద్రంలో 150కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసి వారం రోజుల పాటు ఇక్కడే పునరావాసం కల్పించే సౌకర్యం కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా ఇప్పటి వరకు దాదాపు 5 నుంచి 10 వేల కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 1456 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందంటున్నారు. జనాలు కోతుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఈ పాలక వర్గాలు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఊరూరా మంకీ ప్రొటెక్షన్ టీమ్‌లు

- రక్షణ కోసం కర్రలతో పహారా
- రైతులు, యువకులతో ఏర్పాటు
- పల్లెల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- చేతిలో కర్రలేకుండా నడవలేని పరిస్థితి
- బెదిరిస్తే ఎదురు దాడి
- ఇప్పటికే చాలా మందికి గాయాలు
- మంకీ రెస్క్యూసెంటర్‌ను పట్టించుకోని స్థానికసంస్థలు



సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలో ఉన్న మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్

స్టెరిలైజేషన్‌లో అందరూ భాగస్వాములు కావాలి...

● డాక్టర్ శ్రీకర్ రాజు, వైద్యాధికారి, మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ సెంటర్, నిర్మల్



రోజురోజుకు అంతటా కోతుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. కోతుల సంఖ్య తగ్గించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. కోతుల నియంత్రణకు స్టెరిలైజేషన్ కోసం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు మరింత చొరవ తీసుకోవాలి. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న కోతుల సంఖ్య ఓ సమస్యగా మారింది. సాధారణ ప్రజానీకం, రైతులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం కోతుల సంఖ్యను నియంత్రించాలంటే ఒక స్టెరిలైజేషన్‌తోనే సాధ్యం. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి కూడా నిర్మల్ కేంద్రానికి కోతులను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ చేయిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మరింత చొరవ తీసుకుంటే కోతుల సమస్య కొంత వరకైనా తగ్గుతుంది.

పెన్షన్ల పెంపు సాధించే వరకు విశ్రమించేది లేదు

● భైంసా సన్నాహక సదస్సులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

భైంసా/ఖానాపూర్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ మేరకు అన్ని రకాల పెన్షన్ల పెంపునకు ఉపక్రమించాలని, లేనిపక్షంలో వాటిని సాధించేదాక విశ్రమించబోనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వెల్లడించారు. శుక్రవారం భైంసాలోని సురలోక్‌గార్డెన్స్‌లో వచ్చే నెల హైదరాబాద్ లో నిర్వహించే మహాగర్జనకు సంబంధించి ఇక్కడ నిర్వహించిన సన్నాహక సదస్సులో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌తో కలిసి పాల్గొన్నారు. గతంలో వందల రూపాయల్లోనున్న పెన్షన్లు ఎమ్మార్పీఎస్ ప్రణాళికబద్ధమైన పోరు విధానాలు మూలంగా వేల రూపాయల వరకు పెరిగిందన్నారు. ఇందుకు అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌తోపాటు ప్రస్తుతం రెండు తెలంగాణ రాష్ట్రాల్లోనూ అనుకున్న మేర పెంపుదల అయిందన్నారు. ఇందుకు అనేక అవాంతరాలు, అడ్డంకులు, కుట్రలు, బెదిరింపులు ఎదుర్కొన్న వెరవకుండా, వెనకడుగు వేయకుండా సాధించుకున్నామని వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో పెన్షన్లను పెంచుతామని హామీలనిచ్చి అధికారం చేజిక్కించుకొని 20 నెలల కాలం గడిచినప్పటికీ అమలు చేయకుండా మోసానికి పాల్పడుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ పెన్షన్ల పెంపుదల చేపట్టకుండా అన్యాయం చేస్తున్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ నోరు మెదపకుండా ఉండటం ఎంత వరకు భావ్యమని ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్షాలు పెన్షన్‌దారుల పట్ల బాధ్యతారాహిత్య వైఖరి విధానాలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం మూలంగానే ఎమ్మార్పీఎస్ పెన్షన్ల పెంపుదల సాదనకు నడుం బిగిందందని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మక సన్నాహక సదస్సుకు పెన్షన్‌దారులు తక్కువ సంఖ్యలో హాజరవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ భైంసా డివిజన్ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఖానాపూర్ : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్‌లోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పింఛన్లను పెం చుతామని గతంలో హామీ ఇచ్చిందన్నారు. వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను రూ. 6 వేలకు పెంచాలన్నారు.

రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద రైతులకు, కూలీలకు ఉపయోగకరమైన పనులను చేప్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్‌లో నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల పాకను లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ ప్రారంబించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే గొర్రెలు, పశువుల పాకలు, పౌల్ట్రీ, పొలంబాటలు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజలకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం 100 రోజుల ఈజీఎస్ పనులు పూర్తి చేసిన కూలీ లను ఈ సందర్భంగా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎంపీడీవో గజానన్, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వంద రోజులు పనులు చేసిన కూలీలను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ రూరల్ : మండలంలోని అనంతపేట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'యూరియా అందుబాటులో ఉంచండి'

నర్సాపూర్(జి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని రమేష్ ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి, రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన మెరుపు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్‌ను, ద్రవరూప యూరియా బాటిళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియా నిల్వలు, పంపిణీకి సంబంధించిన వివరాలను దుకాణ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకూడదని, వారికి అవసరమైన యూరియా, ఇతర ఎరువులను తగినంత నిల్వ ఉంచుకోవాలని దుకాణా యజమానికి ఆయన స్పష్టం చేశా రు. ఎరువుల విక్రయాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాలని, అధిక ధరలకు విక్రయించవద్దని హెచ్చరించారు. తనిఖీల్లో తహసీల్దార్ శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) గణేష్ తదితరురలు పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని దుకాణాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఆయిల్‌పామ్ సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

దస్తురాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి స్పందన సూచించారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అధిక వర్షపాతం కారణంగా తోటల్లో నీటి నిల్వలు ఏర్పడి వేర్ల కుళ్లకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తోటల్లో నీరు నిల్వ కాకుండా చిన్న చిన్న కాలువలు ఏర్పాట్లు చేయాలని, తరచూ తోటలను పరిశీలించి నీరు చేరిన ప్రాంతాలను వెంటనే తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారులు నవీన్, విజయ కుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై శిక్షణ

బాసర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రిక్ వాహనాలపై శిక్షణ ప్రారంభమైంది. ఆర్జీయూకేటీ బాసర ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, సెంటర్ ఫర్ డెవలప్ అఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ తిరువనంతపురం మూడురోజులు పాటు నిర్వహించనుంది. నేరుగా ఎలక్ట్రిక్ వాహనాల భాగాలను విడదీసి అమర్చుట, పరిక్షించడం అనే అంశంపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ప్రత్యేక నిపుణులు డా. ఎం.నవీణ్‌కుమార్, రెంజి వీ. చాకో, రామ్‌గోపాల గుప్తలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యాపారం గుట్టురట్టు

నిర్మల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్ దందా నిర్వాహకుల నుంచి సుమారు కోటిన్నర విలువగల ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ జానకి షర్మిల వెల్లడించారు. శుక్రవారం నిర్మల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన కథనం మేరకు... భైంసాకు చెందిన సయ్యద్ అజామ్ అనే వ్యక్తి భైంసా పట్టణంలోని మీసేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా ఆల్ ప్యానెల్.కామ్ అనే బెట్టింగ్ యాప్ ద్వారా తన అక్రమ దందా కార్యకలాపాలని సాగిస్తున్నాడన్నారు. ఈ దందాకు సంబంధించిన బాధితుల బ్యాంక్ ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యాక్సెస్ కూడా ఇతనే తీసుకొని వాళ్ల లావాదేవీలు అన్నింటినీ తన ఆధీనంలో ఉంచుకుంటాడు. ఇందుకుగాను నెలకు కొంత మొత్తం ముట్టచెప్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంటాడు. ఇలా బెట్టింగ్‌లో వచ్చిన డబ్బులను వేరే అకౌంట్‌లో వేస్తూ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నాడు. మరో అడుగు ముందుకేసి వారికి సంబంధించిన ఇన్కమ్‌టాక్స్, ఐటీ రిటర్న్ అంటూ తప్పుడు పత్రాలను సృష్టిస్తున్నాడు. ఇలా లక్షల్లో డబ్బులు ఇవ్వకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ బాధితులను ఇబ్బందులు పెడుతూ మోసగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇదివరకే ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కేసులో లోతైన విచారణ కొనసాగుతుందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడు భైంసా పట్టణానికి చెందిన ఇర్ఫాన్ కాగా సయ్యద్ అజామ్ కూడా సహ నిందితుడిగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. నిందితుడిని భైంసాలోని ఓవైసీ నగర్ మందిర సమీపంలో భైంసా టౌన్ సీఐ గోపీనాథ్‌తో కూడిన పోలీసుల బృందం గురువారం రాత్రి మెరుపు దాడి చేసి పట్టుకుందన్నారు. నిందితుడి నుంచి రూ. 16.3 లక్షల నగదు, 384.38 గ్రాముల బంగారు ఆభరణాలు, 55 గ్రాముల 24 క్యారెట్ల బంగారం బిస్కెట్లు మూడు, ఆస్తులకు సంబంధించిన 21 దస్తావేజులు, మూడు సెల్ ఫోన్లు, లక్ష రూపాయల విలువ చేసే రోల్డ్ గోల్డ్ వస్తువులు, ఎనిమిది ఏటీఎం కార్డులు, పలువురి పాన్ కార్డ్, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జూదం, బెట్టింగ్ లాంటి వాటిని నిర్వహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదన్నారు. ఇటువంటి కేసుల్లో ఎంతటి వారున్నా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించడంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ గోపీనాత్, కానిస్టేబుళ్ల జయవంత్ రావు, ప్రమోద్, మాణిక్ రావు, బాలాజీ, కాంత్రిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎస్పీ ప్రశంసించారు. ఇప్పటి వరకు ఈ కేసులో నిర్మల్‌కు చెందిన పులివెల్లి మణికంత, చలమంతుల శివ చారి, లక్కల నరేష్, కారేగాం ప్రణయ్, చేని కళ్యాణ్, చిక్యాల వెంకటేష్, భైంసాకు చెందిన రెహమాన్, సయ్యద్ ఇర్ఫాన్‌లను అరెస్ట్ చేయగా గురువారం ఈ కేసులో కీలకమైన సయ్యద్ అజామ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

● అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్



పౌల్ట్రీఫామ్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీఆర్డీవో

దిలావర్‌పూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడిషనల్ డీఆర్డీవో చరణ్ దాస్ అన్నారు. ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పౌల్ట్రీ షెడ్డును ఈజీఎస్ ఏపీడీ నాగవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. మల్లాపూర్ గ్రామంలోని మణికంఠ గ్రామ సంఘంలోని శ్రీరామ స్వయం సహాయక సంఘం సభ్యురాలు శ్యామల పౌల్ట్రీ ఫామ్ పెట్టుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆమెకు ఉపాధి హామీ పథకం కింద పౌల్ట్రీ షెడ్డు నిర్మించి ఇచ్చామన్నారు. ప్రతి మహిళ శ్యామల లాగే ఏదో ఒక యూనిట్‌ను ఎంచుకుని ఉపాధి పొందాలన్నారు. . ఈజీఎస్ ఏపీడీ నాగవర్ధన్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే కుటుంబం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భోసు, ఏపీవో దివ్య రెడ్డి, సీసీలు ముత్యం, పోశెట్టి, టీఏలు వెంకట్ రామ్, వెంకట రమణ, వీవోఏ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

● ముథోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్ మండల కేంద్రంలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం, ఒక ఆర్థిక సంవత్సరం కనీసం 100 రోజుల కూలీ పనిదినాలను కల్పించడం ఉపాధిహామీ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముథోల్ మండలకేంద్రంలోని సాయి మాధవ్‌నగర్ కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, మురికికాలువలను ప్రారంభించారు. ముథోల్ నుంచి రువ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు రైతులకు రవాణా సౌకర్యార్థం రూ.9 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రూ.3 లక్షల నిధులతో పబ్లిక్ టాయిలెట్స్, భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుదర్శన్, పీఆర్ ఈఈ చందు జాదవ్, డీఈఈ కమలాకర్, తహసీల్దార్ శ్రీలత, ఏపీవో శిరీషరెడ్డి, సూపరిండెంట్ అశోక్, నాయకులు సతీష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, కోరిపోతన్న, సంతోష్, టి.రమేష్, నర్సాగౌడ్, విఠల్‌రావు, విఠల్, తదితరులున్నారు.

8 మంది ఎస్ఏలకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి

భైంసా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ల నుంచి పదోన్నతి పొందిన గెజిటెట్ ప్రధానోపాధ్యాయులు శుక్రవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. జిల్లాలో మొత్తం 24 గజిటెడ్ ప్రధానపోధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా వాటిని ఇటీవల పదోన్నతుల పొందిన వారిచే భర్తీ చేపట్టారు. మల్టీజోన్ -1 పరిధిలో మొత్తం 438 మంది స్కూల్ అసిస్టెంట్ల నుంచి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందారు. వీరిలో జిల్లా నుంచి 8 మంది పదోన్నతులు పొందారు. ఇందులో ఒకరు నిజామాబాద్ జిల్లా, మరొకరు ఆదిలాబాద్ జిల్లాలోని పాఠశాలకు కేటాయించబడగా మిగతా ఆరుగురు జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు కేటాయించబడ్డారు. ఇక ఖాళీగా నున్న మిగతా 16 పాఠశాలలకు మల్టీజోన్ - 1 పరిధి నుంచి పదోన్నతులు పొందిన ఆయా జిల్లాల్లోని గజిటెట్ ప్రధానోపాధ్యాయులకు కేటాయించారు. వీరిలో అధిక శాతం మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో శుక్రవారం చేరి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు స్టే ఎత్తివేసిన రోజే పదోన్నతుల ప్రక్రియను చేపట్టి మరుసటి రోజే పదోన్నతుల ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ నెల 26న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా , ఎస్‌జీటీలకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కూడా జరుగనుందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొన్నాయి.

ఘనంగా పొలాల అమవాస్య

పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులు తమ బసవన్నలను శుభ్రం చేసి అందంగా అలకరించారు. వాటి కొమ్ములకు రంగులను వేసి, నూతన వస్త్రాలను బసవన్నలపై వేసి ప్రత్యేకంగా అలంకరించారు.



ఉమ్రిలో ఎడ్లపండుగ నిర్వహిస్తున్న రైతులు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డోంగ్రే మారుతి పటేల్



మావలలో బసవన్నలకు పూజలు చేస్తున్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



పూజలు చేస్తున్న రైతు బక్కి కపిల్ దంపతులు



తలమడుగు మండలం రుయ్యాడిలో



హనుమాన్ ఆలయం వద్ద గజానంద్ నాయక్

రెచ్చిపోతున్న.. కలెక్షన్ కింగ్‌లు

(5వ పేజీ తరువాయి...)

కంపే కనిపిస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా భూపట్టాలు, మ్యుటేషన్, డిజిటల్ సైన్ లాంటి పనులకు రైతుల నుంచి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికే పలువురు తహసీల్దార్లపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నట్లు తెలుస్తుంది.

నో ఫోన్ పే.. ఓన్లీ క్యాష్

ప్రభుత్వ శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. బాధితుల నుంచి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా కాకుండా క్యాష్ రూపంలో లంచం సొమ్మును తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. నేరుగా అధికారులు లంచం తీసుకోకుండా డ్రైవర్లు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులను రంగంలోకి దింపుతున్నారు. ఏదైనా జరగకూడనిది జరిగితే.. చేతికి మట్టి అంటకుండా అతి తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడా ఆధారాలు దొరకకుండా ముందస్తుగా అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫోన్ పే, గూగుల్‌పేలతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో నగదును తీసుకునేందు కే ఆసక్తిని చూపుతున్నారు. నేరుగా బాధితులకు వాట్సాప్ కాల్ చేస్తూ డీల్ కుదుర్చుకుంటున్నారు. అంతా నిబంధనల ప్రకారమే ఉన్న కొర్రీలు పెడుతు ఎంతో కొంత లాగేందుకు ప్రయత్నిస్తున్నారు.

వరుస దాడులు

జిల్లాలో గతకొద్ది రోజులుగా ఏసీబీ అధికారులు వరుసగా దాడులు చేయడం అధికార వర్గాల్లో కలకలం రేపుతుంది. ఇది వరకే మున్సిపల్, వైద్య శాఖలో పని చేస్తున్న అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు చేసి అరెస్టు చేయగా.. తాజాగా అవినీతికి కేరాఫ్ అడ్రాస్‌గా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌పై ఏసీబీ వల విసిరి పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. అలాగే రెవెన్యూ, పీఆర్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల్లో పని చేస్తున్న వసూలు రాజాల జాబితా ఏసీబీ చేతికి చిక్కినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం జిల్లాలో ఏసీబీ అధికారులు పోలీస్‌ల పేరెత్తితేనే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు వణికి పోతున్నారు. అయిన ప్రభుత్వ శాఖల్లో లంచాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంపీడీవోకు గ్రామస్థుల వినతి

బజార్హత్నూర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండల కేంద్రంలో నెలకొన్న పలు సమస్యలను తెలియజేస్తూ శుక్రవారం స్థానికులు ఎంపీడీవో శ్రీనివాస్ వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు మండల కేంద్రంలోని కురుక్షేత్ర స్కూల్ సమీపంలో బ్రిడ్జి దగ్గర అలాగే ముత్యంపేట్, జవహర్ నగర్ కాలనీలకు వెళ్లే దారిలో బ్రిడ్జి దగ్గర పెద్ద గుంతలు ఏర్పడి రాత్రి పూట గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వివరించారు. వారితో శేఖర్, హరికృష్ణ, రఘు, రాజు, సుకుమార్ ఉన్నారు.

ఆదివాసీ విద్యార్థులు చదువులో రాణించాలి

తలమడుగు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి విద్యార్థులు చదువులలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సామాజిక కార్యకర్త ముడుపు ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. మండలంలోని కప్పర్ దేవి గ్రామంలో విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేసిన అనంతరం విద్యార్థుల తల్లి తండ్రులను ముడుపు మౌనిష్‌రెడ్డి సత్కరించారు.

రైతులకు సాయం చేసిన ఏఈఓ

ఇచ్చోడ, ఆగస్టు, 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో యూరియాకు సంబంధించిన టోకెన్‌లను రైతులకు అందించి ఇంటికి వెళ్లే సమయంలో సొసైటీ గోదాం ముందు రైతులు తీసుకెళ్తున్న యూరియా బస్తాల వాహనం బురదలో ఇరుక్కుపోయింది. దీంతో సొసైటీకి వెళ్లడానికి దారి మూసుకుపోవడంతో స్పందించిన ఏఈఓ యూరియా లోడ్‌తో ఉన్న మ్యాక్స్ వాహనాన్ని పరిశీలించాడు. డ్రైవర్‌గా మారిన ఆ అధికారి వాహనాన్ని ముందుకు తీసుకున్నారు. రైతులు ఆ అధికారిని అభినందించారు.

సేద్యపు నీటి బావి ప్రారంభోత్సవం

తానూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బామ్ని తండాలో శుక్రవారం సేద్యపు నీటిబావిని ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. పనుల జాతరలో భాగంగా గ్రామానికి చెందిన రైతు కరచంద్ ఈ బావిని నిర్మించుకోగా, రైతులు సేద్యపు బావులను నిర్మించుకోవడం వలన కలిగే లాభాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో నసీరోద్దిన్, ఏపీవో శివలింగం, ఏపీఎం సులోచన రెడ్డి, టీఏలు, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించాలి

కుంటాల, ఆగస్టు, 22 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను వారి వారి తల్లిదండ్రులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కుంటాలతో పాటు దౌనెల్లి గ్రామాలకు వెళ్లి గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సం దర్భంగా ఆయన విద్యార్థుల తల్లి దండ్రులకు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తు న్న సౌకర్యాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగపరుచుకొని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా త ల్లిదండ్రులకు సూచించారు. అంతేగాకుండా విద్యార్థులు ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత వారు చదువుకుంటున్న తీరును పరిశీలించాలని ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా ఉపాధి పనుల జాతర

కుంటాల, ఆగస్టు, 22 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో శుక్రవారం ఉపాధిహామీ పనుల జాతరను ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం లక్ష్మణ్ పాల్గొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ఒకపనిని ప్రారంభించాలనే ఉద్దేశంతో కల్లూరు, అందకూర్, పెంచికల్‌పాడ్ గ్రామాలలో ఇటీవల ఉపాధి హమీ పథకంలో నూతనంగా నిర్మించిన పశువుల పాకలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



కల్లూరు గ్రామంలో మందకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల, ఆగస్టు, 22 : (ఆంధ్రజ్యోతి) : ఉద్యమ నేతమందకృష్ణ మాదిగను శుక్రవారం కల్లూరు గ్రామంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ దళిత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న అంతేగాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా వచ్చిందని లోలం శ్యాంసుందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, మాజీ జడ్పీటీసీ ఉత్తం బాలేరావు, తాజా మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్‌పటేల్, సుధాకర్, దిగంబర్, రమణ గౌడ్, బీఆర్ఎస్ ఐటీసెల్ అధ్యక్షులు పెంట దశరథ్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నర్సయ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు పడకంటి దత్తు, వీడీసీ అధ్యక్షులు భరత్, భూషణ్, ప్యాక్స్‌డైరెక్టర్ పసుల పురుషోత్తం, బండిప్రశాంత్, కాంగ్రెస్ బీఆర్ఎస్ బీజేపీ నాయకులు సునీల్ రెడ్డి, ప్రశాంత్, ముత్యం, గైని సునీల్, దత్తు, దిగంబర్, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా పొలంబాట ఏర్పాటు

బోథ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రైతాంగం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్న అని అందులో భాగంగానే పొలంబాటల ఏర్పాటు చేయటం జరుగుతున్నదని బొథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనుగుట్ట గ్రామ రైతుల కోసం బోథ్ వెళ్లే దారిలో పొలం బాట కార్యక్రమంలో భాగంగా 15 లక్షల రూపాయలతో చేపట్టిన పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులు తమ పంట చేలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని గమనించి పొలం బాటలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు కలగకుండా పొలం బాటలో ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే పొలం బాటలో ఏర్పాటుకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఏపీవో జగ్దేరావు ఆత్మ డైరెక్టర్ అబూద్, కనుగుట్ట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత పెరిగింది

బోథ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని కోటబి దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పదోన్నతి పొందిన మేనేజర్‌ను గ్రామానికి చెందిన పెద్దలు మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి మాజీ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లెపూల గంగయ్య గ్రామ నాయకులుకే గంగాధర్ సన్మానించారు. బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహించేందుకు మొదట కొంత ఇబ్బందికి గురయ్యానని అయితే గ్రామస్తుల సహకారంతో ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడుకుంటూ డిపాజిట్లను పెంచడం జరిగిందన్నారు. ఒకప్పుడు 9 లక్షల రూపాయల డిపాజిట్లు ఉన్న బ్యాంకు ప్రస్తుతం 27 లక్షలకు చేరిందన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

బోథ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని డాక్టర్ నవీన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సాయిప్రియ, సవిత, కవిత, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశ కార్యకర్త వీణ, వైద్య సిబ్బంది తోపాటు ప్రిన్సిపాల్ సంగీత పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేసిన యువకులు



శ్రమదానం చేస్తున్న యువకులు

నర్సాపూర్(జి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(కె) గ్రామం నుంచి లోకేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి వర్షాకాలంలో ధ్వంసమైంది. రోడ్డుపై ఏర్పడిన లోతైన గుంతలు, రాళ్లు నడవడానికి కూడా ఆటంకంగా మారాయి. సమస్యను గుర్తించిన గ్రామ యువకులు సుధీర్, రాహుల్, క్రాంతి, నవీన్, విజయ్, గణేష్ సహా మరికొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రెండు రోజులుగా కష్టపడి గ్రామంలో లభించిన ఇసుక, మొరం, చిన్నరాళ్లను సేకరించి కిలోమీటరు మేర రోడ్డును బాగు చేశారు. దీంతో గ్రామసులు వారిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మునస్లపాడు గ్రామంలో గిరిజన యువకుడు తాగిన మైకంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది మునస్లపాడు గ్రామానికి చెందిన వెడ్మ గణేష్ (28) భార్య శ్రీదేవి రాఖీ కట్టడానికి ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని తన తల్లిగారి ఇంటికి వెళ్ళింది. శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి తలుపులు తెరిచేసరికి తన భర్త మృతిచెంది ఉన్నట్లు గుర్తించిందని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వ్యవసాయ పనులు చేస్తూ ఇంటి వద్ద ఉన్న గణేష్ తాగిన మైకంలో పురుగుల మందు తాగిఆత్మహత్య చేసుకున్నాడని, గణేష్ శవాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించామని, భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి రిమాండ్

సారంగాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండలో గత నాలుగు నెలల క్రితం జరిగిన చోరిలో ప్రధాన నిందితుడు మహ్మద్ రహీం(23) తో పాటు , దొంగతానికి ప్రోత్సహించి దొంగ సొమ్మును కొనుగోలు చేసిన నాంపల్లి వెంకటేశ్(33) లను పోలీసులు అదుపులోకి తీసుకొని నిందితుల వద్ద నుండి సుమారు 2కిలోల వెండి వస్తువులు, ఒక ఆటో(ఏపీ 01టీఏ 0110)ను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఇద్దిరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు.

కుటుంబానికి అండగా నిలిచింది

నర్సాపూర్(జి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన నిర్మల అనే కూలీ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వరుసగా వంద రోజులు పని చేసి తన అంకితభావాన్ని నిరూపించుకుంది. ఆమె కృషిని అభినందిస్తూ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, గ్రామ కార్యదర్శి కైలాస్ రాథోడ్ ఆమెను ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించారు.

సంబరంగా పొలాల పండుగ



గోశాలలో పొలాల అమావాస్య



భోసి హనుమాన్ ఆలయం వద్ద



కుభీర్‌లో పొలాల అమావాస్య

నిర్మల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ గండి రామన్న దత్తసాయి బాబా ఆలయంలో పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోశాలలో సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులను ప్రత్యేకంగా అలంకరించారు. అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను గోశాలలో నిర్వహించినట్లు తెలిపారు. ముక్కోటి దేవతలు కొలువైన గోవులను ప్రతి ఒక్కరూ పూజించాలని కోరారు. ఇందులో జైపాల్ రెడ్డి, ఉప్పుల నందు, పూదరి నరహరి, అజయ్ కుమార్, తుపాకుల శ్రీనివాస్, నారాయణ రెడ్డి, గోవర్ధన్, సాతర్ల శ్రీనివాస్, రాజ్ మాస్టర్, శంకర్, ఆలయ పూజారులు ఆనంద్ రావు, గౌతమ్, నారాయణ, భక్తులు పాల్గొన్నారు. బసవన్నల పండగగా భావించే పొలాల అమావాస్యను శుక్రవారం గ్రామస్తులు, రైతులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులు తమ బసవన్నలను శుభ్రం చేసి అందంగా అలకరించారు. వాటి కొమ్ములకు రంగులను వేసి, నూతన వస్త్రాలను బసవన్నలపై వేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టు ప్రదక్షిణలు వేయించి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



భైంసాలో ఉత్తమ రైతులకు సన్మానం



దిలావర్‌పూర్‌లో ఎద్దులతో హనుమాన్ మందిరానికి వెళ్తున్న రైతులు



తురాటి గ్రామంలో ఎడ్లను ఊరేగిస్తున్న దృశ్యం

డాక్టర్ దేవేందర్ రెడ్డి వైద్య సేవలకు అభినందన



డాక్టర్ దేవేందర్ రెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ దేవేందర్ రెడ్డి సేవలను గుర్తించి ఆర్మీ మేజర్ ప్రశంసాపత్రాన్ని పంపారు. రెండు నెలల కిందట ఆర్మీ మేజర్ హైదరాబాద్ నుంచి జబల్‌పూర్‌కు బదిలీ అయ్యాడు. ఈ మేరకు తన కుటుంబంతో కలిసి నిర్మల్ మీదుగా జబల్‌పూర్ వెళ్తుండగా స్థానిక కొండాపూర్ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగింది. వారిని స్థానికులు నిర్మల్‌లోని దేవేందర్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కి తీసుకువచ్చారు. ఈ మేరకు డాక్టర్ దేవేందర్ రెడ్డి 24 గంటలు హాస్పిటల్ లోనే ఉండి మేజర్ కుటుంబానికి అత్యుత్తమ చికిత్సను అందించారు. అనంతరం వారిని ఆర్మీ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో దేవేందర్ రెడ్డి సేవలను ఆ మేజర్ గుర్తుంచుకొని నిర్మల్ పోలీసులకు ప్రశంసా పత్రాన్ని పంపించి, డాక్టర్‌కు అందించాలని కోరారు. దీంతో ఈ ప్రశంసా పంత్రాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో ఏఎస్పీ రాజేష్ మీనా డాక్టర్ దేవేందర్ రెడ్డికి అందజేశారు. ఇం దులో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్సై లింబాద్రి ఉన్నారు.

గణపతి నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

నిర్మల్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ ఎస్సై లింబాద్రి అన్నారు. మండలంలోని నీలాయిపేటలో గణేష్ మండప నిర్వాహకులు, యూత్ మెంబర్స్‌కు, ప్రజలకు జాగ్రత్త చర్యల గురించి అవగాహన కల్పించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సాయన్న, వైస్ ఎంపీపీ గాండ్ల విలాస్, నెమలి అర్జున్, కొండ మురళి గౌడ్, నీలాయిపేట వీపీవో తేలు సంతోష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు మట్టి గణపయ్య సిద్ధం

నిర్మల్ రూరల్ : వినాయక చవితి ఉత్సవాలకు మట్టి గణపతి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మండలంలోని అనంతపేటకు చెందిన యువ కళాకారుడు, కవి పోలీస్ భీమేష్ గత 25 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ఎటువంటి హానికరమైన రంగులు వాడకుండా సహజసిద్ధంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రకృతి పరిరక్షణకై దోహదపడాలన్నారు.

దస్తురాబాద్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం గణేష్ మండప నిర్వాహకులు, నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎస్సై సాయికుమార్ ఉన్నారు.

కలెక్టర్ అల్లంపల్లిని సందర్శించాలి

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



అల్లంపల్లిలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్

కడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అల్లంపల్లి పరిసర గ్రామాలు అతలాకుతల మయ్యాయని, కలెక్టర్ అల్లంపల్లి పంచాయతీని సందర్శించి, సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ శుక్రవారం కడెం మండల బీజేపీ నాయకులతో కలిసి అల్లంపల్లి పంచాయతీని సందర్శించారు. రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. వర్షానికి కొట్టుకుపోయిన బ్రిడ్జిలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అల్లంపల్లి, పరిసర గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, దీనికి తోడు భారీ వర్షాలు కురియడంతో గిరిజనం నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కడెం మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్, అల్లంపల్లి పంచాయతీ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సహాయం

కడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మొర్రిగూడెం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ దంపతుల కూతురు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. కడెం మండల ఆర్యవైశ్య సంఘం తరపున రూ.11,150 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొల్లూరి చంద్రహాస్, పాలకుర్తి కృష్ణ, భూపాల్, ఎన్. ప్రసాద్, గంప ప్రసాద్‌లున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

దిలావర్‌పూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పనుల జాతరలో భాగంగా దిలావర్‌పూర్ గ్రామశివారులోని ప్రసిద్ధ ఎల్లమ్మ దేవస్థానం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గుండంపల్లి, బన్సపల్లి, సాంగ్వి, కాల్వ, సిర్గాపూర్, కంజర్, మాయపూర్, మాడెగాం, సముందర్‌పల్లి గ్రామా ల్లో గ్రామసభలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, సెర్ప్ అడిషనల్ డీఆర్డీవో చరణ్ దాస్, డీజీఎస్ ఏపీడీ నాగర్ధన్, ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్, ప్రవళిక, శేఖర్, ఏపీఎం భోసు, ఏపీవో దివ్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, స్వాతి, సునీల్, మహిళలు, గ్రామస్థులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మటన్‌షాప్ సీజ్

నిర్మల్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మదీనా కాలనీ పాత చేపల మార్కెట్ పక్కన ఉన్న మటన్‌షాప్ యజమాని గణేష్ నాసిరకం మాంసం విక్రయించడంతో పాటు పరిశుభ్రత ప్రమాణాలు పాటించనందుకు షాప్‌ను సీజ్‌చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మటన్‌షాప్ యజమానులందరూ పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, నాణ్యమైన మాంసం విక్రయించాలని, పురపాలక సంఘం చట్టం 2019 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవదాసు, ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ జవాన్ శేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమాతోనే కుటుంబానికి ధీమా

మామడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బీమాతోనే కుటుంబాలకు ధీమా ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున మామడ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన సురక్ష ప్రోగ్రాంలో భాగంగా దిమ్మదుర్తి గ్రామానికి చెందిన పొన్నం పుష్ప ఇటీవల అనారోగ్యంతో రెండు నెలల క్రితం మరణించడంతో వారి భర్త పొన్న రత్న గౌడ్‌కు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ డబ్బులు రెండు లక్షల రూపాయలను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరోగ్య కిట్లు

● నిర్మల్ జిల్లాకు 926 కిట్ల సరఫరా ● కిట్‌లో చిన్నారులకు చికిత్సలకు ఉపయోగపడే అన్ని రకాల మందులు

భైంసా, ఆగస్టు 22: వర్షాకాలపు వ్యాధులతో సతమతమయ్యే చిన్నారులకు సకాలంలో చికిత్సలు, అవసరమైన మందులను అందించేందుకు గాను ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరోగ్య కిట్లను అందచేసింది. వానకాలంలో వాతవరణంలో చోటు చేసుకునే మార్పులతో వ్యాధుల బెడద నెలకొని ఉంటుంది. వర్షకాలంలో సీజన్‌లో అన్ని ప్రాంతాల్లోని చిన్నారులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.ప్రధానంగా చిన్నారులకు వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. ఇలాంటి చిన్నారులందరూ ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుతుంటారు. వీరందరికి కేంద్రాలలో చికిత్సలు నిర్వహింప చేసి మందులను అందించేందుకు గాను ఆరోగ్య కిట్లను సరఫరా గావించింది. వీటికి తోడు కేంద్రాల్లో ఆటలు ఆడుకునే సమయంలో చిన్నారులు గాయాల బారిన పడుతుంటారు. ఇలాంటి తరుణంలో వారికి తక్షణమే ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన మందులు, ఇతర సామగ్రిని సైతం కిట్లలో జత చేసి అందించారు.



● 926 ఆరోగ్య కిట్ల సరఫరా

నిర్మల్ జిల్లాలోని భైంసా, ముథోల్, ఖానాపూర్, నిర్మల్ కేంద్రాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటన్నింటి పరిధిలో మొత్తం 926 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలన్నింటికి ఆరోగ్య కిట్లు అందించేందుకు గాను జిల్లాకు మొత్తం 926 కిట్లు సరఫరా అయ్యాయి. ప్రాజెక్టుల వారీగా సరఫరా అయిన ఆరోగ్య కిట్లు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అందచేశారు. ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలో 249, నిర్మల్ పరిధిలో 297, భైంసా పరిధిలో 205 ముథోల్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటన్నింటిలో ఏడు నెలల నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 55,339 మంది ఉన్నారు.

● ఆరోగ్య కిట్‌లో..

కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు అప్పటికప్పుడు వైద్యం అందించేందుకు, ప్రథమ చికిత్స నిర్వహింప చేసేందుగాను ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి ఆరోగ్య హెల్త్ కిట్లు సరఫరా చేశారు. ఇందులో గాయాలను శుభ్రం చేయడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్, దూది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, దురద నివారణ మందు, చెవినొప్పి చుక్కల మందు, జ్వరం, దగ్గు జలుబులకు సిరప్‌లు, మాత్రలు అందించారు. వీటిని స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది సూచనలతో చిన్నారులకు వేసేలా అంగన్వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.



భైంసాలో చిన్నారులను ఆటలాడిస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఇన్‌సెట్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన ఆరోగ్య కిట్)



నివాళ్లర్పిస్తున్న టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ వినయ్‌కుమార్

ఇంద్రవెల్లి అమరవీరులకు ఘన నివాళ్లు

ఇంద్రవెల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అమరులైన వీరులకు టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా.వినయ్ కుమార్ శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తో కలిసి ఆదివాసీ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి అమరుల పోరాటం మన చరిత్రలో ఓ గర్వకారణం అని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం చేసిన వారి త్యాగమే మనకు ప్రేరణ. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల పక్షానా నిలుస్తూ, రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మెస్రం నాగనాథ్, పరత్ వాగ్ విశాల్, కనక తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉట్నూర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మహిళా కళాశాల విద్యార్థుల ఎంపిక

ఉట్నూర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయం అని ప్రిన్సిపాల్ బానోత్ హరిత తెలిపారు. రాష్ట్ర పోటీలలో అథ్లెటిక్స్‌కు ఎంపిక కావడం అభినందనీయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 100 మీటర్ల రన్నింగ్ పోటీలకు రేణుక, సావిత్రి బాయి, మాధవి విజేతలుగా నిలవడం హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. లాంగ్ జంప్‌లో అశ్విని, మాధవి అదే విధంగా షాట్‌పుట్‌లో లక్ష్మి, సోనాలి విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొంటూ శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, బుర్రమానస, కొరిమి ప్రత్యుష, పూర్ణిమ, శారద, శరణ్య, రాణి లక్ష్మిప్రసన్న, శిరీష, సంధ్య, హరిక, లక్ష్మి, స్వప్న, శ్రీదేవి,పీడీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాంసిలో అధికారికంగా పొలాల అమాస్య వేడుకలు

● ఏర్పాట్లను సిద్ధం చేసిన జిల్లా అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస పొలాల అమాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాలో బసవన్నల పండుగాను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసారి పొలాల అమాస్య పండుగను శుక్ర, శని వారాల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కాగా శనివారం తాంసి మండల కేంద్రంలో పొలాల అమాస్య పండుగను జిల్లా అధికార యంత్రాంగం తొలిసారిగా నిర్వహిస్తుంది. ఆధ్యాకళ నిర్వాహకులు జయదేకర్ తిరుమలరావు సమన్వయంతో పండుగను పెద్దఎత్తున నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ వేడుకలను చూసేందుకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, మహారాష్ట్ర సరిహద్దు మండలాల నుంచి పెద్దఎత్తున రైతులు, ప్రజలు తరలిరానున్నారు.

భక్తిశ్రద్ధలతో సంతోషి మాత వ్రతాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠంలో మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సాముహిక సంతోషి మాత వ్రతాల ఉద్యాపన చేపట్టారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో ఇండ్లల్లో సాముహిక సంతోషి మాత వ్రతాలు ఆచరించిన మహిళలు... ఆలయంలో చెల్లింపుల సందర్భంగా ప్రత్యేక పూజాది క్రతువులు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిపి సంతోషి మాతను ఆరాధించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడమని తల్లిని వేడుకున్నారు. మహిళల ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

'పనుల జాతరలో పాత పనులే కొత్తగా ప్రారంభం'

నేరడిగొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనుల జాతరలో భాగంగా నెరడిగొండ మండలంలోని ఇస్పూర్ గ్రామంలో నిర్వహించిన నూతన గ్రామ పంచాయతీ భవనంతో పాటు క్యాటిల్ షెడ్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్తులు సన్మానించారు. అనంతరం కార్మికులు వంద రోజుల పని పూర్తి చేసుకున్న వారికి ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి వాంకిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేదని దీనిని కేసీఆర్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేశారని అన్నారు. పనుల జాతరలో పాత పనుల ప్రారంభోత్సవాలే ఉన్నాయని కొత్త పనులు మంజూరు చేసి కార్యక్రమం పెడితే బాగుండేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పంచాయతీ రాజ్ ఈఈ, శివరాం. అడిషినల్ పీడీ కుటుంబరావు, డీఈ ధర్మేందర్, ఏఈ రాథోడ్ దినేష్, ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ కలీం, ఏపీవో వసంత్ రావ్, నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శివారెడ్డి, రమేష్, నానక్ సింగ్, రాజు, సవాయిరాం, అనిల్ యాదవ్, రాథోడ్ సురేందర్, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, గులాబ్, భరత్, తదితరులు ఉన్నారు.

రాత్రి వేళల్లో ఇసుక, కలప అక్రమంగా తరలిస్తే చర్యలు

● ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ అటవీ క్షేత్ర అధికారి

సిరికొండ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ అభయారణ్యం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళ అక్రమంగా ఇసుక, కలప తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ అటవీక్షేత్రధికారి గంటల శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదిలాబాద్ ఫారెస్టు టాస్క్ ఫోర్స్, సిరికొండ అటవీ సిబ్బందితో కలిసి రిమ్మ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పట్టుకున్నారు. అట్టి ట్రాక్టర్లను జప్తు చేసి సిరికొండ అటవీ కార్యాలయానికి తరలించి, నిందితులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల్ అభయారణ్యం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, కలప తరిలించే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుని, వాహనాలను జప్తు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బీట్ అధికారులు సజన్లాల్, శ్యాంసుందర్, భీంజీ, కలెందర్, ఆడే సంతోష్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల రౌండ్ టేబుల్ సమావేశం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీకి చెందిన ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘల పిలువు మేరకు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బహుజన టీచర్స్ ఫెడరేషన్ సంఘం అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జీవో ఎంఎస్ నెం.2లో ఉన్న వాటిని సవరించి ఓపెన్ మెరిట్‌లో వచ్చిన ఎస్సీ, ఎస్టీలను ఓపెన్‌లో ఉద్యోగోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులలో రిజర్వేషన్స్ ఇచ్చి కూడా ఉపయోగం లేకుండా పోతుందని పేర్కొన్నారు. జీవో నెం. 2ను మార్చి అడేద్దీసీ సవరణ చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని, సెప్టెంబరు 21న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉద్యోగ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ నరేష్, ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు కూర పోచన్న, డీటీయూ జిల్లా కన్వీనర్ నగేష్, కో కన్వీనర్ బొర్రా నగేష్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు సూరం పోచన్న, కార్యదర్శి కుమ్మరి సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పథకాలు పేదలకు చేరుతున్నాయా?

● కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై ప్రజలు ఏమంటున్నారు? ● సమాక గ్రామంలో ఆరా తీసిన మీనాక్షి నటరాజన్

ఇంద్రవెల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించటానికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శుక్రవారం మండలంలోని సమాక గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కతో కలిసి సమాక గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సరైన సమయంలో అందుతున్నాయా? లేదా? అనే విషయాలను ప్రత్యక్షంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి ప్రభుత్వ పథకాల లబ్ది అందని పలువురు గ్రామస్తులను వెంట తీసుకొని మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రజావాణి-ప్రజా ఫిర్యాదుల పరిష్కారం బహిరంగ విచారణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల తరఫున మీనాక్షి నటరాజన్ టీం సభ్యులు గ్రామస్థుల సమస్యలను లిఖితపూర్వకంగా సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. అంతేకాకుండా ప్రతీ ఒక్క సమస్యపై సమగ్రంగా విచారణ చేసి, తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు. అలాగే, పైలెట్ ప్రజావాణి - ప్రజా ఫిర్యాదుల పరిష్కారం బహిరంగ విచారణ వేదిక ముగిసే వరకు వేచి ఉన్నారు.



గ్రామస్తులతో సమావేశమైన ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

పంట పొలాల్లో ఇసుక దిబ్బలు

● ఆదిలాబాద్‌లో భారీ వర్షాలు, వరదలకు నేలమట్టమైన పత్తి, సోయా పంటలు

ఆదిలాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంట పొలాల్లో ఇసుక దిబ్బలు ఏర్పడి కనిపిస్తున్నాయి. వరదల ఉధృతికి పత్తి, సోయా, కంది పంటలు నేలమట్టమయ్యాయి.చేతికి వచ్చిన పంటలు చేజారి పోవడంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. పంట చేన్లు ఇసుక, రాళ్లు రప్పలు, బురదమయంగా మారడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 417 గ్రామాల్లో మొత్తం 7522 మంది రైతులకు సంబంధించిన 19791 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

పంటలకు తీవ్ర నష్టం

ప్రధానంగా పత్తి 14532 ఎకరాలు కాగా సోయా 2811 ఎకరాలు, కంది 1823 ఎకరాలు, మరో 625 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ముఖ్యంగా పెన్‌గంగా, కడెం నది పరివాహక ప్రాంతంలోని భీంపూర్, తాంసి, బోరజ్, జైనథ్, బేల, ఆదిలాబాద్‌రూరల్ మండలాల్లో భారీ పంట నష్టం జరిగింది. అలాగే వందల ఎకరాల పంట పొలాలు కోతకు గురై పంటల సాగుకు పనికి రాకుండానే పోయాయి. బోరజ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన వట్టెం భూమయ్య అనే రైతు 12 ఎకరాలలో పత్తి పంటను సాగు చేయగా పెన్‌గంగా వరదల ఉధృతికి 7 ఎకరాలు పత్తి పంట నేలమట్టమైంది. ఇలాంటి పరిస్థితులే చాలా గ్రామాలలో కనిపిస్తున్నాయి.



పూసాయి గ్రామంలోని పంట చేనులో కనిపిస్తున్న ఇసుక దిబ్బలు



బోరజ్ మండంలో వరద ఉధృతికి నేలమట్టమైన పత్తి పంట



ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బాసర అమ్మవారి సన్నిధిలో.. సామూహిక వరలక్ష్మీ పూజలు

● పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

బాసర, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శుక్రవారం పురష్కరించుకొని సామూహిక వరలక్ష్మీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద గల అక్షర శ్రీకారం మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక మహిళలు, మహిళ భక్తులు పాల్గొని పూజలు జరిపారు. వరలక్ష్మీ వ్రత ప్రాముఖ్యత, శ్రావణ మాస విశిష్టతను ఆలయ అర్చకులు వివరించి మహిళలచే పూజలు జరిపించారు. చిన్నారులు సైతం పూజలు నిర్వహించడం అందరిని ఆకట్టుకుంది.



పూజల్లో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

● కుంచవలీ పహడ్ వరకు ప్రశాంతంగా సాగిన శోభాయాత్ర
● పెద్దసంఖ్యలో పాల్గొన్న యువత

భైంసా, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): భైంసాలో ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతం నుంచి కుంచవలీ పహడ్ వరకు శోభాయాత్ర కొనసాగింది. ఉదయం ఉత్సవ ప్రతినిధుల సారథ్యంలో జరిగిన శోభాయాత్రలో మైనార్టీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు తలలపై చాదర్‌ను తీసుకవెళ్లి కుంచవలీ పహడ్‌లోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సమర్పించారు. మరికొంత మంది అశ్వంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి చాదర్‌లను కుంచవలీ పాహడ్ దర్గా వరకు తీసుకవెళ్లి సమర్పించారు భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు కుంచవలీ పహడ్‌కు చేరుకొని అక్కడి దర్గా వద్ద ప్రార్థనలు చేపట్టారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన శోభయాత్రలో యువకులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కుంచవలీ పహడ్ దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్, ఏఎస్పీ సంకేత్ కుమార్, అవినాష్ కుమార్, తదితరులు

ఐడియా.. అదిరింది గురూ!!

బోథ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అటవీ సమీపంలో ఉన్న పొలాల చుట్టూ చెట్లకు వివిధ రకాల డ్రెస్సులను తొడిగారు. మండలంలోని కౌట(బి) గ్రామంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన ఐడియాలు ఫలిస్తున్నాయి. దీంతో రాత్రిపూట వెన్నెల సమయంలో పంట పొలాల చుట్టూ కాపలా ఉన్నారా? అన్నట్లు కనిపిస్తోందని అటుగా వచ్చిన అంటున్నారు. అంతేకాకుండా అడవి పందులు, జంతువులు ఇటువైపు రావటం లేదని రైతులు పేర్కొంటున్నారు.



కౌటా(బి)లో మొక్కజొన్న చేను చుట్టూ చెట్లకు రైతులు తొడిగిన డ్రెస్సులు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3, కనిష్ఠం 23.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 23 ఆగస్టు 2025

జీవో 28కు నిరసనగా ఆందోళన : పీఆర్టీయూ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలను అడియాశలు చేస్తూ గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 28కు నిరసనగా ఈనెల 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ప్రభుత్వానికి వివరణ దినం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పడితే న్యాయపరమైన డిమాండ్లు నెరవేరతాయని భావిస్తే జీఓ 28ను తీసుకువచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.


కార్యదర్శితో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శిని కలిసిన ఎంపీ గోడం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభు నాయర్ ను ఎంపీ గోడం నగేష్ ఢిల్లీలో కలిశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే అభివృద్ధి, సంక్షేమ పథకాల బడ్జెట్ విడుదల, రోడ్లు, సామూహిక భవనాలు, ఏకలవ్య మాడల్ ఆశ్రమ పాఠశాలల మంజూరు గురించి ఆయనతో చర్చించగా.. సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ గోడం నగేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇప్పించండి


మంత్రి వివేక్‌ను కలిసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువైందని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక అనుమతులు ఇప్పించాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. గురువారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజక వర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్ ప్రాంతాలలో ఇసుక లభించక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందుల పాలవుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణ పనులకు ఇసుక లభించక లబ్ధిదారులు నిర్మాణాలు చేపడతలేరని తెలిపారు. స్థానికంగా ఇసుక దిబ్బలు(క్వారీలు) లేకపోవడం వల్ల, ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి ఇసుకను రవాణా చేయవల్సి వస్తుందని, ఇసుక ఇతర ప్రాంతాల నుంచి తరలించడంతో ఖర్చు పెరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అవసరం ఉందని సహకరించాలని మంత్రిని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కోరడంతో మంత్రి వివేక్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వివరించారు.

ప్రభుత్వ శాఖల్లో.. కలెక్షన్ కింగ్‌ల అవినీతి, ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొంతమంది అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. లక్షల రూపాయల వేతనం తీసుకుంటున్నా.. అది సరిపోదంటూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. సులువుగా వస్తున్న అక్రమ సంపాదన మోజులో పడి ఏసీబీ వలకు చిక్కుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో పైసలు ఇవ్వనిదే ఫైల్ కదలడం లేదంటున్నారు. ప్రతీ పనికి ఓ లెక్కా అంటూ నిర్ణయిస్తున్నట్లు తెలుస్తుంది.



● జిల్లాకేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రెచ్చిపోతున్న.. కలెక్షన్ కింగ్‌లు

- ఐదు నెలల్లోనే ఏసీబీ వలకు చిక్కిన నలుగురు అధికారులు
- రెవెన్యూ శాఖలోనూ పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు
- ఏసీబీ అధికారుల దూకుడుతో అధికార వర్గాల్లో వణుకు
- వసూల్ రాజాల ఆగడాలతో బెంబేలెత్తి పోతున్న జనం

...ప్రభుత్వ శాఖల్లో మితిమీరిపోతున్న అవినీతి, అక్రమాలు

ఆదిలాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లంచాలకు మరిగిన కొంత మంది అవినీతి అధికారులు ప్రజలను జలగల్లా పట్టి పీడిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక ఎంతోకొంత ముట్టజెప్పి పనులు చేయించుకుంటున్నారు. కాని కొంత మంది ధైర్యంగా ముందుకు వచ్చి లంచవతారుల భరతం పడుతున్నారు. ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తూ అవినీతి అధికారులను కటకటాల పాలు చేస్తున్నారు. తాజాగా ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన గిఫ్ట్‌డీడ్ కోసం రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి అధికారులు వరుసగా ఏసీబీ వలకు చిక్కడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పట్టుబడుతున్న అదేతీరు

గత కొన్నాళ్లుగా దూకుడు పెంచిన ఏసీబీ అధికారులు అవినీతి అధికారుల పై వలవిసిరి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. అయినా అవినీతి అధికారుల తీరు మారినట్లు కనిపించడం లేదు. గడిచిన ఐదు మాసాల్లోనే వరుసగా నలుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం కలకలం రేపుతుంది. మార్చి 11, 2025న ఈడబ్ల్యూఐడీసీలో పని చేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలను లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే జూన్ 26, 2025న మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న అకౌంట్స్ అధికారి రాజ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్‌లు ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని అరెస్టు చేయడం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది.

రెవెన్యూ శాఖలోనూ వసూలు రాజాలు

మున్సిపల్, సబ్‌రిజిస్ట్రార్ శాఖలతో పాటు రెవెన్యూ శాఖలోను వసూలు రాజాల ఆగడాలు మితిమీరిపోతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూశాఖలో అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్న కొంత మంది అధికారులు నిబంధనల సాకుతో అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. ముఖ్యంగా మండల స్థాయిలో కొంత మంది తహసీల్దార్లు పైసలు ఇవ్వనిదే ఏ ఫైల్ ముట్టుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్న తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి

(తరువాయి 6వ పేజీలో....)

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్: గిఫ్ట్ డీడ్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. గమనించిన కొంత మంది కార్యాలయ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు దాడులు జరపగా.. లంచం తీసుకుంటున్న జాయింట్ రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకున్నారు. సిలికన్ పరీక్ష నిర్వహించి పాజిటివ్ రావడంతో అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు. బాధితుడు బేల మండలం సిర్సన్నకు చెందిన మన్సూర్ ఖాన్ పటాన్ వద్ద గిఫ్ట్ డీడ్ అయిన తర్వాత రూ.5వేలు ఇస్తున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని డీఎస్పీ మధు తెలిపారు. అధికారులు లంచం అడిగితే పోలీసులు లేదా ఏసీబీని సంప్రదించాలని, అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెం. 1064ను సంప్రదించాలని తెలిపారు.





ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అకౌంటెంట్ రాజ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్. జూన్ 26, 2025న ఓ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించే విషయంలో రూ.20 వేల లంచం డిమాండ్ చేసి రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. దీనిని మరిచి పోకముందే.. తాజాగా ఆదిలాబాద్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు చిక్కడంతో ప్రభుత్వ శాఖల్లో పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తునే ఉంది.


యూరియా కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్న రైతులు

పండగ పూట యూరియా తంటా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో ఇష్టంగా జరుపుకునే పొలాల అమావాస్య పండగ రోజున సైతం వారికి యూరియా కష్టాలు వీడలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల అనంతరం పొలం పనుల్లో అన్నదాతలు నిమగ్నం కాగా.. ప్రస్తుతం ఉన్న పంటల స్థితికి యూరియా అవసరం కావడంతో పండగ పూట కూడా యూరియా కోసం పట్టణంలోని ఎరువుల షాపుల ఎదుట శుక్రవారం క్యూ లైన్‌లలో నిల్చున్నారు. ఇంటిల్లిపాది సంతోషంగా పండగ జరుపుకోవాల్సిన సమయంలో దుకాణాల ముందు యూరియా కోసం వేచి చూడడం అన్నదాతల ఇబ్బందులకు నిదర్శనం నిల్చింది. అయితే యూరియా సరఫరా పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. క్యూ లైన్‌లో గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోందని, సరైన సమయంలో యూరియా అందకపోతే తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని వాపోయారు.

'యూరియాపై రాజకీయాలు'

ఆదిలాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూరియాపై రాజకీయం చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు.శుక్రవారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాందా గ్రామంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలు, వరదలకు కొట్టుకు పోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఇప్పటికే రైతులు 80 శాతం వరకు పెట్టుబడులను పెట్టారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించకుండానే పంట నష్టం అంచనా వేస్తున్నారని అన్నారు. ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు.

బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- వరద ప్రాంతాలలో పర్యటన

తలమడుగు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో భారీగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోవడంతో శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఉండం గ్రామంలో మెడికల్ క్యాంప్, కొత్తూరు వరద ముంపు ప్రదేశంలో పంట నష్ట పరిశీలన, తలమడుగు ప్యాక్స్ కేంద్రం, గోదాంలో ఉన్న యూరియా స్టాక్ వివరాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన, డొర్లి గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పడిన పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఉండం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించి అక్కడి వైద్య సేవలపై అధికారులతో చర్చించారు.

అనంతరం కొత్తూరు గ్రామంలో వరద ముంపు ప్రాంతాల్లో పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే, మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్యాక్స్ కేంద్రం, గోదాములో ఉన్న యూరియా నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఇరువురు ఎరువులు అక్రమంగా విక్రయిసే కఠిన చర్య తప్పవన్నారు. ప్రతి రైతుకు ఆధార్ కార్డు పట్టా పాస్బుక్ ద్వారా ఎరువులను విక్రయించాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన ఇందనం ప్రారంభించాలని సూచించారు. 48 రోజుల్లోగా పనులు ప్రారంభించకుంటే రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా మండల కేంద్రంలోని చర్చి కాలనీలో ప్రతి సంవత్సరం వరదతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ముంపు బాధితులు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో తహసీల్దార్ రాజ్‌మోహన్, డీఏవో శ్రీధర్ స్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన మనోహర్, ఎంపీడీవో శంకర్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి సామాజిక కార్యకర్త ముడుపు ముడుపు మౌనిష్ రెడ్డి, ఎంపీ ఈవో వినోద్ కుమార్, ఉండం మాజీ సర్పంచ్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.


తలమడుగు మండలంలో ముంపునకు గురైన పంటలపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాజర్షి షా

క్షుద్ర పూజల కలకలం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. స్థానిక దస్నాపూర్ కాలనీలో రోడ్డు పైనే క్షుద్ర పూజలు చేయడంతో కాలనీ వాసులు భయందోలనకు గురవుతున్నారు. అమావాస్య రోజున ఇండ్ల ముందు నిమ్మకాయలు, పసుపు, దిష్టిబొమ్మ ఉంచి పూజలు జరపడంతో అటు వైపు వేల్లెందుకే జనం జంకుతున్నారు. అయితే ఆకతాయిలు స్థానికులను భయాబ్రాంతులకు గురి చేయాలన్న ఉద్దేశంతో చేశారో.. లేదా నిజంగానే క్షుద్ర పూజలు జరిగాయా అన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతన్నాయి. పండగ పూట రోడ్డు పైనే క్షుద్రపూజలు జరిగిన ఆనవాళ్లు కనిపించడం మాత్రం స్థానికుల్లో ఆందోళనకు కారణమవుతోంది.


● నడి రోడ్డుపై క్షుద్ర పూజలు


సైబర్ వారియర్‌లతో ఎస్పీ అఖిల్ మహాజన్

సైబర్ నేరాల నియంత్రనే లక్ష్యం : ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతీఒక్క పోలీస్ స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్ ను కేటాయిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో 19 పోలీస్ స్టేషన్‌లలో సైబర్ విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్స్‌కు ప్రత్యేకంగా టీ షర్టు లను అందించి వారికి పలు సూచనలు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్‌ను గుర్తించే విధంగా హైదరాబాద్ నుంచి సైబర్ సెక్యూరిటీ బ్యూరో వారు ప్రత్యేకంగా తయారు చేయించి జిల్లాకు పంపించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే అవగాహన తప్పనిసరి అని పేర్కొన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించాలని, లేనిపక్షంలో సీవైబీఈఆర్‌సీఆర్ఐఎంఈ.జీవీ.ఐఎన్ వెబ్ సైట్ లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ డీఎస్పీ హసీబుల్లా, ఏఎస్సై సురేందర్, సైబర్ సిబ్బంది సంతోష్, ఏసుదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సెట్ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ

ఉట్నూర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌సెట్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఈనెల 28 నుంచి ప్రారంభిస్తున్నామని ఆర్‌సెట్ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. హౌజ్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫోటోగ్రఫి మరియు వీడియోగ్రఫి, ఫ్రిడ్జ్, ఏసీ రిపేరింగ్, టు వీలర్ రిపేరింగ్, సీసీ టీవీల ఇన్స్టాలేషన్, కుట్టుమిషన్ శిక్షణలు ఇవ్వనున్నామన్నారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, శిక్షణ అనంతరం రానుపోను బస్సు చార్జీలు, టూల్‌కిట్స్, మరియు శిక్షణ పొందిన సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు, పదవ తరగతి వరకు చదువుకుని పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఈనెల 27 వరకు కార్యాలయానికి దరఖాస్తులు పంపుకోవాలని తెలిపారు. మిగత వివరాల కోసం ఫోన్ నెం.9949412159, 9441530494, 8096093085, 8985633226 ద్వారా సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పల్లెల అభివృద్ధి లక్ష్యంగా పనులు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- జిల్లాలో పలుచోట్ల 'పనుల జాతర'

ఇంద్రవెల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 20 నెలల కాలంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఊరురా పనుల జాతర కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు, ఇందిరమ్మ ఇండ్లు, జీపీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తనట్లు తెలిపారు.

ఆ తర్వాత ప్రజావాణి-ప్రజా ఫిర్యాదుల పరిష్కారం బహిరంగ విచారణ వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. డీఆర్డీవో పీడీ రాథోడ్ రవిందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో బాస్కర్, ఎంపీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని శ్యాంపూర్‌లో జరిగిన పనుల జాతర కార్యక్రమానికి హాజరైన ఇందిర స్వశక్తి పథకం ద్వారా మహిళలకు మంజూరైన పౌల్ట్రీ అభివృద్ధి పనుల కోసం లక్షెటిపేటకు చెందిన తొడసంకవితకు రూ2.35 లక్షల, గోదరిగుడకు చెందిన మాధవికి రూ.2.19 లక్షల , దుర్గం విజయకు రూ.2.18 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.


శ్యాంపూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్


సిరికొండలో మేకల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

సిరికొండ రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర- 2025లో భాగంగా శుక్రవార మండల కేంద్రానికి చెందిన గోర్బండ్ లక్ష్మణ్, గొర్ల మల్లేష్‌లు నిర్మించుకున్న పశువుల పాకలను ఎంపీడీవో రవీందర్ తో కలిసి ఆయన ప్రారంభించారు.

భీంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమం చేపడుతుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. భీంపూర్ మండలం గోనలో శుక్రవారం పనుల జాతరలో భాగంగా పంచాయతీ భవనం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఘనంగా పొలాల అమావాస్య

- సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేసిన రైతన్నలు
- ఎడ్లకు వివిధ రంగులు, సామగ్రితో అలంకరణ
- ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు... నైవేద్యాల సమర్పణ
- నేడు అధికారికంగా తాంసిలో వేడుకలు
- ఏర్పాట్లను సిద్ధం చేసిన జిల్లా అధికారులు


మత్తడిగూడలో పండుగ నిర్వహించుకుంటున్న ఆదివాసీ గిరిజనులు

మరిన్ని వివరాలు 6, 7వ పేజీలో....